ప్రజాశక్తి

ఆదివారం 11 జూన్ 2023

5

పార్వతీపురం మన్యం



రూ.3.5 లక్షల నాటుసారా ధ్వంసం

ప్రజాశక్తి - సాలూరు

మండలం లోని కురుకూటి పంచాయతీ కొటియా గ్రామాల్లో ఒకటైన కోయ గుడ్డివలసలో ఏడు డ్రమ్ముల నాటుసారా ధ్వంసం చేసినట్లు కొటియా సిఐ రోహిణిపతి తెలిపారు. తమకు ముందస్తుగా అందిన సమాచారం మేరకు ఆ గ్రామం వెళ్లి నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న పాత్రలను ధ్వంసం చేసినట్లు చెప్పారు. ధ్వంసం చేసిన సారా విలువ రూ.3.5లక్షల విలువ ఉంటుందని ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. అలాగే నాటుసారా ఎవరైనా తయారు చేసినా, విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటుసారా నివారణకు గ్రామస్తులు సహకరించాలని కోరారు.

ఆవాసం కోసం అవస్థలు

- స్థలాలిచ్చిన చోట మౌలిక వసతుల కరవు
- ఇళ్ల నిర్మాణాలకు నీరు, విద్యుత్ కొరత
- అటు వెళ్లలేక... ఇటు సొంత గ్రామంలో ఉండలేక ఇబ్బందులు
- ఇవీ తోటపల్లి నిర్వాసిత సుంకి వాసుల కష్టాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

తోటపల్లి ప్రాజక్టు నిర్మాణంలో భాగంగా 2007లో సుంకిని నిర్వాసిత గ్రామంగా ప్రభుత్వం గుర్తించింది. వారి సాగు భూములతో పాటు వ్యక్తిగతంగా అప్పటి లెక్కలు ప్రకారం నష్టపరిహారం చెల్లించడానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. 18 ఏళ్లు నిండి పెళ్లికాని వారికి రూ.55 వేలు, పెళ్లయిన వారికి రూ.62 వేలు చొప్పున వ్యక్తిగతంగా అందరికీ చెల్లించారు. భూములకు సంబంధించి నష్టపరిహారం కూడా చెల్లించారు. అయితే నివాసం కోసం స్థలాలిచ్చిన చోట మౌలిక వసతుల కల్పన అధికారులు విఫలమయ్యారు. రోడ్లు, కాలువలు నిర్మించి, ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిపేశారు. తాగునీటితో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. దీంతో సుంకి గ్రామస్తులకు నివాస సమస్య పెద్ద సమస్యగా మారింది.

తోటపల్లి నిర్వాసితుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. భవిష్యత్తు తరాల కోసం తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఇళ్లను సైతం వదలి పెట్టడానికి సిద్ధమవుతున్న తమ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని సుంకి గ్రామస్తులు వాపోతున్నారు. ఏళ్లు గడిచినా ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో పిల్లా పాపలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఇళ్ల నష్టపరిహారం మాటేలేదు...

వ్యక్తిగత, భూములకు నష్టపరిహారం చెల్లించిన ప్రభుత్వం ఇళ్ల విషయంలో మాత్రం పట్టించుకోలేదు. ఏళ్లు గడుస్తున్నా ఇళ్ల నష్టపరిహారంపై అటు అధికారులు, ఇటు ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటనా రాలేదు. దీనిపై పలుమార్లు గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. దీంతో ఆందోళనలకు సైతం దిగినా ప్రయోజనం కనిపించలేదు. ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోకపోవడంతో, ఇళ్ల నష్టపరిహారం అంశం మరుగునపడిపోయింది.

గ్రామాన్ని ఖాళీ చేయాలని ఒత్తిళ్లు

2018లో రెవెన్యూ అధికారులు సుంకి గ్రామానికి వచ్చి గ్రామాన్ని ఖాళీ చేయాలని తెలిపారు. ఉల్లిభద్ర రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 190లో 11.93 ఎకరాలు, సాంబన్న రెవెన్యూ పరిధిలో 18, 19 సర్వే నెంబర్లలో 14.13 ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. తక్షణమే గ్రామాన్ని ఖాళీ చేసి ఇళ్ల స్థలాలు ఇచ్చిన చోట్ల ఇళ్లు నిర్మించుకోవాలని, అక్కడ మౌలిక సదుపాయలన్నీ కల్పిస్తామని, 290 మందికి పట్టాలు సిద్ధంచేశామని తెలిపారు. దీనిపై సుంకి గ్రామస్తులు అడ్డు చెప్పారు. తమ ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వకుండా, గ్రామం ఖాళీ చేసే పరిస్థితి లేదని తేల్చి చెప్పారు. అదే సమయంలో తమకు స్థలాలిచ్చిన చోట ఇళ్ల నిర్మాణాలకు నిధులివ్వాలని కోరారు. దీంతో అధికారులు సమాధానం చెప్పకుండా అక్కడి నుంచి జారుకున్నారు.

అవాసం కోసం అవస్థలు

నివాసం విషయంలో సుంకి గ్రామస్తుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. ప్రస్తుతం నివాసం ఉన్న ఇళ్లను అభివృద్ధి చేసుకోవాలనుకున్నా, కొత్తగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నా అధికారులు అడ్డుచెబుతున్నారు. దీంతో ఇప్పటికే ఉన్న ఇళ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో సుంకి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంగానీ, కాలువలు, రోడ్ల నిర్మాణానికి నిధులివ్వడం లేదు. దీంతో గ్రామస్తులు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇళ్ల స్థలాలు కేటాయించిన దగ్గర ఇళ్ల నిర్మాణానికి ముందుకొస్తున్నా అక్కడ నీరు, విద్యుత్ వంటి కనీసం సదుపాయలు సైతం అధికారులు కల్పించలేదు. నీరు, విద్యుత్ లేకుండా ఇళ్ల నిర్మాణాలు ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. కేవలం పాఠశాలకు మాత్రమే స్థలం కేటాయించారు. శ్మశాన వాటిక, దేవాలయానికి స్థలం కేటాయించలేదు. ఇదే విషయం అధికారుల దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. ముందుగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభిస్తే నీరు, విద్యుత్‌తో మిగిలిన వసతులు కల్పిస్తామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఏళ్ల తరబడి పట్టించుకోని అధికారుల మాటలను ఎలా నమ్మాలోనన్న అనుమానం సుంకి గ్రామస్తుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే 15 మందికిపైగా నిర్వాసితులు మృతి చెందారని, తమకు కేటాయించిన ప్రాంతానికి వెళ్లేసరికి ఇంకెంతమంది చనిపోతారోనని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు

వసతుల్లేని చోటకు ఎలా వెళ్తాం

నిర్వాసితులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదు. మాకు స్థలాలిచ్చిన చోట నీరు లేదు. ఇళ్లు ఎలా కడతాం. శ్మశాన వాటిక కూడా లేదు. దేవాలయం నిర్మాణానికి స్థలం కేటాయించాలి. పట్టాలు మాత్రమే ఇచ్చి ఇళ్ల నిర్మాణాలకు నిధులు ఇవ్వకపోతే ఎలా? ఇంటి నిర్మాణానికి కేంద్రం ప్రభుతం నిర్వాసితులకిచ్చే రూ.లక్షా 85వేలుతో పాటు అదనంగా రూ.4.15 లక్షలివ్వాలి. మౌలిక వసతులు కల్పించాలి.



కొల్లి రవీంద్ర,
గ్రామ సర్పంచి, సుంకి

మౌలిక వసతులు కల్పించాలి

ఆదుకోవాల్సిన ప్రభుత్వం మమ్మల్ని అనాథులుగా వదిలేయడం అమానుషం. మాకు స్థలాలిచ్చిన చోట మౌలిక వసతులు కల్పించాలి. ఉన్న ఊళ్లో ఉండలేక, స్థలాలిచ్చిన చోటకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నాం. చావలేక బతకలేక చస్తున్నాం. మా ఆవేదనను అధికారులు, ప్రజాప్రతినిధులు అర్థం చేసుకుని, మమ్మల్ని ఆదుకోవాలి.



వి.గోవిందరావు
మాజీ సర్పంచి, సుంకి

ముందు ఇళ్లు కట్టండి

249 మందికి ఇంకా 89 పట్టాలు తీసుకోవాల్సి ఉంది. నిర్వాసితులు ముందుగా ఇళ్ల నిర్మాణాలు చేపడితే తర్వాత ఓవర్ హెడ్ ట్యాంక్, విద్యుత్తుకు సంబంధించిన పనులు చేయడానికి ట్రైబల్ వెల్ఫేర్ సిద్ధంగా ఉంది. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ అనుకూలంగా ఉన్నారు.



పిఎస్ఎల్ కుమార్,
ఇన్చార్జి తహశీల్దార్.

రెండోసారి పెచ్చులూడిన దండిగాం రోడ్డు

- టేగ్ కోట్ సరిగ్గా వేయక లేచిపోతున్న పైపొర
- నోటీసిచ్చినా స్పందించని కాంట్రాక్టరు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి -సాలూరు

పట్టణం లోని బోసు బొమ్మ జంక్షన్ నుంచి పిఎన్ బొడ్డవలస సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాల వరకు నిర్మించిన రహదారి మూణ్ణాళ్ల ముచ్చటగా మారింది. సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ రహదారి నిర్మాణ పనిని గత ఏడాది ఆగస్టులో చేశారు. అప్పుడు వర్షం పడుతున్న సమయంలో కాంట్రాక్టరు రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో నాణ్యత లేక యధావిధిగా పెచ్చులూడి గుంతలుగా తయారైంది. కోటి రూపాయల అంచనాతో ఈ రహదారి నిర్మాణంలో కాంట్రాక్టరు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో అస్తవ్యస్తంగా తయారైంది. తారు రోడ్డు నిర్మాణం చేపట్టినప్పుడు పాత రోడ్డును బాగా గీకి టేగ్ కోట్ వేయాల్సి ఉంది. అయితే ఆ విధంగా టేగ్ కోట్ వేయకపోవడంతో కొత్తగా వేసిన తారు రోడ్డు పైపొర తరచూ లేచి పోతోంది. జెసిబి ప్రొక్లెయిన్‌తో పాత రోడ్డును బాగా గీకిన తర్వాత టేగ్ కోట్ వేయాల్సి ఉంటుంది. మొదటిసారి పనులు చేసినప్పుడు తగిన ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే రెండోసారి వేయాల్సి వచ్చింది. రెండోసారి కూడా ప్రమాణాలు పాటించకపోవడంతో పెచ్చులూడి గుంతలుగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణం నుంచి దండిగాం రోడ్డులో బంగారమ్మ పేట, పిఎన్ బొడ్డవలస, మామిడిపల్లి, కురుకూటి, కందులపథం, తోణాం గ్రామాలకు నిత్యం వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. కరాసువలస, కొత్తవలస క్వారీల నుంచి భారీ లోడులతో లారీలు ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తున్నాయి. నాణ్యత లేకపోవడంతో రోడ్ పెచ్చులూడి గుంతలుగా మారుతోంది.

నోటీసిచ్చినా స్పందించని కాంట్రాక్టరు

కాంట్రాక్టరుకు నోటీసులిచ్చినా స్పందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో అధికారపార్టీ కి చెందిన కీలక ఎమ్మెల్యేకు ఆయన సన్నిహితుడు కావడంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. అందుచేతనే స్థానిక అధికార పార్టీ నాయకులు కూడా మౌనం వహిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. రోడ్డు నిర్మాణం చేసిన కాంట్రాక్టరు నిర్వహణను రెండేళ్ల వ్యవధిలో ఎన్ని సార్లు పాడైనా బాగు చేయాల్సి ఉంటుందని నిబంధనలు సూచిస్తున్నాయి.



పెచ్చులూడిపోయిన దండిగాం రోడ్డు

త్వరలో మరమ్మతు పనులు

బోసు బొమ్మ జంక్షన్ నుంచి పిఎన్ బొడ్డవలస పాఠశాల వరకు నిర్మించిన రోడ్డు మరమ్మతు పనులు త్వరలో కాంట్రాక్టరు చేస్తారు. ఇప్పటికే ఆయనకు నోటీసు జారీ చేశాం. రోడ్డు మెయింటెయిన్స్ వ్యవధి రెండేళ్లు ఉంటుంది. ఆ సమయంలో ఎన్ని సార్లు పాడైనా బాగు చేయాల్సి ఉంది.

సుబ్బారావు, డిఇ, ఆర్ అండ్ బి, సాలూరు

మండుతున్న ఎండలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జూన్ నెల వచ్చినా రుతుపవనాలు రాక ఆలస్యం కావడంతో ఎండల తీవ్రత అత్యధిక స్థాయిలో నమోదవుతుంది. తగ మూడురోజులుగా ప్రతిరోజూ 44 డిగ్రీల పైబడి ఉష్ణోగ్రతలో నమోదువుతున్నాయి. దీనికి తోడు వడగాల్పులు కూడా వీయడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎండ వేడిమి కనిపిస్తుంది. రాత్రివేళ ఉక్క పోత వెంటాడుతుంది. దీంతో చిన్నారులు, గర్భిణీలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండుతున్న ఎండల తీవ్రత కారణంగా ప్రజలు 10 గంటల్లోపు ఇంటికి చేరుకుంటున్నారు. దీంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా ఉష్ణోగ్రతలు అత్యధిక స్థాయిలో నమోదవుతున్నాయని ప్రజలు అంటున్నారు.



ఎండలకు నిర్మానుష్యమైన గుమ్మలక్ష్మీపురం ప్రధాన రహదారి

తరగతుల నిర్వహణకు పాఠశాలలు సన్నద్ధం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

వేసవి సెలవుల ఈనెల 11తో సరి. సోమవారం నుంచి బడులు తెరచుకోకున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని అన్ని పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలతో ముస్తాబై ఉన్నాయని ఎంఇఒ ఎన్.నాగభూషణరావు తెలిపారు. మండలంలోని 57 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, నాడు-నేడు కార్యక్రమం మొదటి విడత జాబితా 28 పాఠశాల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. రెండో విడత నాడు-నేడు 28 పాఠశాలలు, ఆరు అంగన్వాడీ కేంద్రాల పనులు చేపట్టామన్నారు. ఇందులో 70 శాతం వరకు పనులు జరగ్గా ఈనెల 30నాటికి పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అలాగే గతేడాదితో పోల్చితే ఈ ఏడాది విద్యార్థుల అడ్మిషన్లు కూడా పెరగాయని చెప్పారు. ప్రభుత్వం నుండి 90శాతం వరకు పాఠ్య పుస్తకాలు వచ్చాయని, వీటన్నింటినీ పంపిణీ చేసినట్టు తెలిపారు.

పి .చాకరాపల్లి బస్సు సర్వీస్ పునరుద్ధరణ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పి.చాకరాపల్లి నుంచి బస్సు సర్వీసును శనివారం నుంచి ఆర్‌టిసి అధికారులు పునరుద్ధరించారు. ఇది వరకు వచ్చే ఈ బస్సు అజ్జాడ నుండి పి.చాకరాపల్లి మధ్యలో రోడ్డు నిర్మాణ పనులు జరగడంతో సర్వీసు నిలిపివేశారు. మళ్లీ శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి ప్రారంభించడంతో యధావిధిగా బస్ సర్వీసులు కొనసాగాయి.


కొనసాగుతున్న ఉపాధ్యాయ బదిలీలు

నేటితో ముగింపు.. 12న కొత్త స్థానాల్లోకి టీచర్లు

ప్రజాశక్తి-విజయనగరం

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం నుంచి ఆప్షన్లు పెట్టుకుంటున్నారు. కోరుకున్న స్థానాలను ఎంపిక చేసుకుంటున్నారు. బదిలీ ప్రక్రియంతా ఆన్‌లైన్‌లోనే సాగుతోంది. ఇంటి నుంచే ఉపాధ్యాయులు కంప్యూటర్లలో ఖాళీలను చూసుకొని తమకు అనుకూలమైన స్థానాలను ఎంపిక చేసుకున్నారు.

వారం రోజులుగా బదిలీలపై కసరత్తు చేస్తున్న విద్యాశాఖ అధికారులు తర్జన భర్జనల అనంతరం ఖాళీలను ఖరారు చేశారు. వాటిని ఉన్నతాధికారులకు పంపి ఆమోదం పొందారు. శుక్రవారానికి స్కూల్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ ముగిసింది. బదిలీ అయిన, ఉద్యోగోన్నతులు పొందిన వారు ఎంపిక చేసుకున్న స్థానాలకు వెళ్లిపోయారు. ఐదు వేల మంది వరకూ బదిలీల్లో భాగస్వాములు కాగా, ఇందులో ప్రధానోపాధ్యాయులు 130 మంది, స్కూల్ అసిస్టెంట్లు, పండిట్లు 1103 మందికి పైగా తప్పనిసరిగా బదిలీ అయ్యారు. విద్యాశాఖ అధికారులు సబ్జెక్టుల వారీగా షెడ్యూల్ నిర్ణయించారు. ఖాళీలు ప్రకటించిన వెంటనే ఆప్షన్లు పెట్టుకుంటున్నారు. ఇదంతా గుట్టుగానే సాగుతోంది. ఇప్పటివరకూ జిల్లాలో ప్రధానోపాధ్యాయులు 130 మంది, స్కూల్ అసిస్టెంట్లు సోషల్, సైన్స్, లెక్కలు, వ్యాయామ ఉపాధ్యాయులు 611 మంది, ప్రమోషన్లు ద్వారా 25 మందికి, లాంగ్వేజ్ పండిట్లు ఇంగ్లీష్, హిందీ, తెలుగు సబ్జెక్టులకు 502, ప్రమోషన్ల ద్వారా 110 మందికి శుక్రవారం అర్ధరాత్రి వరకు బదిలీలు జరిగాయి. శనివారం వారంతా బదిలీ అయిన పాఠశాలల్లో చేరారు. శనివారం నుంచి 2400 పైగా ఎస్‌టిజిలకు బదిలీ కౌన్సిలింగ్ కొనసాగుతోంది. తప్పనిసరిగా బదిలీ కావాల్సిన ఎస్‌జిటిలు 2400 మందికి పైగా ఉన్నారు. బదిలీల ప్రక్రియ ప్రశాంతంగా సాగుతోందని జిల్లా విద్యా శాఖ అధికారులు తెలిపారు.



కొత్తగా చేరిన ఉపాధ్యాయులకు స్వాగతం పలుకుతున్న సహచరులు

బదిలీల ప్రక్రియ ఆదివారంతో ముగియనుంది. ఈ నెల 12న బదిలీల అయిన స్థానాల్లో చేరాల్సి ఉంది. పిఇటిలు 30మంది, లాంగ్వేజ్ పండిట్లు 61 మందికి బదిలీ జరగాల్సి ఉంది. వీరి బదిలీ ప్రక్రియ మాన్యువల్ పద్ధతిలో నిర్వహిస్తారు. ఇక డిఇఒ పూల్, అనారోగ్య, ఇతర సమస్యలతో ఉన్న వారిని ప్రాధాన్యత కేటగిరీలో పెట్టారు. వారికి పట్టణాలకు దగ్గరలో ఉన్న స్థానాల్లో అవకాశాలు కల్పించనున్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో ఒఆర్ఎస్, జింక్‌కార్నర్ తప్పనిసరి

ప్రజాశక్తి - సీతానగరం

ఒఆర్ఎస్, జింక్ కార్నర్లను అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య సిబ్బంది ఏర్పాటు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన చిన్నయ్యవలస, కృష్ణారాయపురం, బూర్జ గ్రామాలను శనివారం సందర్శించారు. అంగన్వాడీ, వెల్నెస్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఒఆర్ఎస్, జింక్ కార్నర్లను పరిశీలించారు. అతిసార నియంత్రణ పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా డయేరియా లక్షణాలున్న పిల్లలను గుర్తించి వారికి ఒఆర్ఎస్, జింక్ మాత్రలు నిర్దేశించిన మోతాదులో అందజేయాలని, ఈనెల 17 వరకు ప్రతి రోజూ సర్వే చేయాలని అన్నారు. అలాగే సార్వత్రిక టీకా కార్యక్రమంలో భాగంగా టీకా కార్డులు, రిజిష్టర్లలో టీకా వేసిన తేదీలు, గడువు తేదీలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పిల్లల బరువు, వారి వయస్సుకు తగ్గట్టుగా ఉన్నదీ, లేనిదీ అంగన్వాడీ సిబ్బంది ఏ విధంగా గుర్తిస్తున్నారో గమనించారు. ఇటు సిబ్బంది, అటు తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డాక్టర్ జగన్మోహనరావు సూచించారు. ఇందులో వైద్య సిబ్బంది మంగమ్మ, జయలక్ష్మి, గాయత్రి, సంధ్య, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది ఉన్నారు.

ఛార్జీల బాదుడుతో ప్రజలపై పెనుభారం

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రం లో వైసిపి ప్రభుత్వం ప్రజలపై ట్రూ అప్ ఛార్జీలతో పెనుభారం మోపిందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి జి.సంధ్యారాణి చెప్పారు. శనివారం ఆమె నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా జగన్ ప్రభుత్వం ప్రజలపై పన్నుల రూపంలో భారాన్ని వేసిందని చెప్పారు. వేసవిలో ఎప్పుడు విద్యుత్ వుంటుందో తెలియని అయోమయ పరిస్థితి కనిపిస్తోందన్నారు. విద్యుత్ కోతలతో జనం అల్లాడిపోతున్నారని చెప్పారు. టిడిపి హయాంలో మిగులు విద్యుత్ వుండేదని చెప్పారు. వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా అమలులో లేదన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ మీటర్లు ఏర్పాటును తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకిస్తే ఇక్కడ జగన్ ప్రభుత్వం మీటర్ల ఏర్పాటుకు అంగీకరించిందని చెప్పారు. వైసిపి పాలనలో అరాచకాలు తప్ప ప్రజలకు జరిగిన మేలు ఏమీ లేదని సంధ్యారాణి చెప్పారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, మండల నాయకులు యుగంధర్, ఎం.శ్యాం సుందరరావు,పట్టణ నాయకులు పప్పల మోహన్ రావు, కొనిసి చిన్ని, డబ్బి కృష్ణ పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : విద్యుత్ ఉత్పత్తి పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతో వేసవిలో ప్రజలకు కరెంటు కష్టాలు తప్పడం లేదని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి విమర్శించారు. గుమ్మలక్ష్మీపురంలోని తన స్వగహంలో శనివారం విలేకరులతో ఆమె మాట్లాడారు. 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటనలు చేసిన వైసిపి ప్రభుత్వం వేసవిలో తీవ్ర విద్యుత్ కోతలు విధిస్తోందని మండి పడ్డారు. ఇటీవల ట్రూ అప్, ఇతర ఛార్జీల పేరిట రూ.60 వచ్చే విద్యుత్ బిల్లు రూ.120 వస్తుందని, ప్రజలపై మోయలేని ఆర్థిక భారాన్ని మోపిందని విమర్శించారు. విద్యుత్ కొనుగోలులో వైసిపి ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరించిందని విమర్శించారు. గత ఒప్పందాలను రద్దు చేసి జగన్ తన జేబు సంస్థలకు విద్యుత్ కొనుగోలు వ్యవహారాల ప్రాధాన్యత కల్పించి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామన్న హామీ గాలికి వదిలేసి, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు వరకు విద్యుత్ అందిస్తామన్న జగన్మోహన్ రెడ్డి ఈనాటికి కూడా ఆ హామీని నెరవేర్చలేదన్నారు. ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చిన్నారులు, గర్భిణీలు, రోగులు, వృద్ధులు ఉక్కపోతతో తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఈ దుస్థితి గత ప్రభుత్వంలో లేదని చెప్పారు. ఇప్పటికైనా ప్రజల కష్టాలను గుర్తించి నిరంతరం విద్యుత్ సరఫరా అందించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ ఒక్కరోజు ఆర్భాటం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



జిల్లాలో పర్యావరణ పరిరక్షణ ఒక్కరోజు ఆర్భాటంగా మారిందా? అంటే ఔననే సమాధానం బలంగానే వినిపిస్తోంది. ఈ విషయంలో అటు ప్రభుత్వానికి, ఇటు అధికార యంత్రాంగానికి చిత్తశుద్ధి లేదనే వాదన కూడా గట్టిగానే ఉంది. ప్రభుత్వ విధానాలు, స్వార్థపూరిత వైఖరి, ప్రజల నిర్లక్ష్యం.. కారణం ఏదైనా పర్యావరణం మాత్రం కలుషితమౌతూనే ఉంది. పంచ భూతాలుగా చెప్పుకుంటున్న గాలి, నీరు, నిప్పు, భూమి, ఆకాశంలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. బహుశా అందువల్లే అకాల వర్షాలు, వడగాల్పులు మానవాళిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తిరిగి వాతావరణ సమతుల్యతను పాటించేందుకు ప్రత్యేకంగా దినోత్సవాలు, వివిధ కార్యక్రమాలు ప్రభుత్వాలు చేపడుతున్నాయి. ముఖ్యంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 5వ తేదీన ప్లాస్టిక్ వాడకం, మొక్కల ప్రాధాన్యత, చెట్ల సంరక్షణ, భూగర్భజలాల పరిరక్షణ, వాయు కాలుష్యంపైనా సదస్సులు, ర్యాలీలు, సమావేశాలు పలు శాఖల ఆధ్వర్యాన జరిగాయి. ఇందులో చిత్తశుద్ధి ఎంత? అన్నది ప్రస్తుతం పబ్లిక్ టాక్‌గా మారింది. ఇందుకు కారణం లేకపోలేదు. ప్లాస్టిక్ వల్ల భూమి వేడెక్కుతుందంటూనే వాటి నిషేధంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధి కనబర్చడం లేదు. ఒకప్పుడు బ్యాగులు, గోనె సంచులు, బుట్టలు వంటివి జ్యూట్, వెదురు, చింతపిక్కలతో తయారు చేసేవారు. వాటి వల్ల ఆయా వృత్తిదారులు జీవనోపాధి పొందేవారు. పర్యావరణానికి ఇబ్బంది ఉండేది కాదు. కార్పొరేట్ సంస్థలు వాటిని ప్లాస్టిక్, పాలిథిన్ వంటి రూపాల్లో అందంగా, ఆకర్షణీయంగా తయారు చేసి వ్యాపారపరం చేయడంతో ఆయా వృత్తిదారులు జీవనోపాధి కోల్పోయారు. క్రమంగా జ్యూట్ ఉత్పత్తులు తగ్గుముఖం పట్టడం వల్ల సాగు విస్తీర్ణం కూడా తగ్గిపోయింది. ఒకప్పుడు విజయనగరం జిల్లా గోగు సాగుకు, జ్యూట్ మిల్లులకు పెట్టింది పేరు. ప్రత్యేకంగా రైతుల నుంచి గోగునార కొనుగోలు చేసేందుకు స్థానికంగా జ్యూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఉండేది. క్రమంగా జ్యూట్ ఉత్పత్తులను తగ్గించడం వల్ల ఒకప్పుడు 20 మిల్లులు ఉన్న ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం నాలుగైదుకు మించి తిరగడం లేదు. ఇటువంటివన్నీ పట్టించుకోకుండా ఉత్తుత్తి హడావుడి ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఇష్టారాజ్యంగా మైనింగ్ అనుమతులు ఇవ్వడం, అనుమతుల్లేకుండానే మైనింగ్ చేయడం వంటి కారణాల రీత్యా చాలా గ్రామాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. భూగర్భజలాలు కలుషితమౌతున్నాయి. ఇక చెట్లు నరికేయడం తప్ప మొక్కలు నాటిన సందర్భాలు లేవు. మొక్కలు నాటడంపై ప్రభుత్వ లెక్కలన్నీ రికార్డుల్లో మాత్రమే కనిపిస్తున్నాయి. వాల్టా చట్టానికి యథేచ్ఛగా తూట్లు పడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం వలేదు. దీంతో, ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోందని నిపుణులు చెబుతున్నారు. మరోవైపు సహజ ఇంధన వనరులను వినియోగించాలంటూనే వాటి ధరలు ఆకాశాన్ని అంటే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. బ్యాటరీతో నడిచే మోటార్ సైకిళ్ల ధర కూడా ఎక్కువగానే ఉంది. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణపై ప్రభుత్వానికి గానీ, అధికారులకు గానీ చిత్తశుద్ధి లేదని, లేదంటే ఒక్కరోజు ఆర్భాటం కాకుండా ఏడాది పొడవునా కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణపై ఉద్యమం సాగేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



సత్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

అన్నదాన సత్రానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలోని ముడునూరు వారి వీధిలో బెవర గోపాల నాయుడు అన్నదాన సత్రం నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ అన్నదాన సత్రం రూ.30 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణం జరుగుతుంది. బెవర గోపాల నాయుడు కుటుంబ సభ్యులు రూ.ఆరు లక్షల విరాళంగా ఇవ్వగా, మిగిలిన రూ.24 లక్షలు దేవాదాయ శాఖ అందజేసింది. కార్యక్రమంలో శ్రీ బెవర గోపాల నాయుడు కుటుంబ సభ్యులు, కౌన్సిలర్లు, దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సత్రంలో 30 మంది విద్యార్థులకు అవకాశం ఉందని, ఈ సత్రంలో ఇంతవరకు చదివిన విద్యార్థులు ఎంతో మంచి స్థానంలో ఉన్నారని శాసన మండలి సభ్యులు విక్రాంత్ తెలిపారు.

ఇంటర్ సీట్లు పెంచాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల గిరిజన గురుకుల బాలుర, బాలికల భద్రగిరి, భద్రగిరి పివిటిజి, పి.కోనవలస, కురుపాం కళాశాలల్లో అదనంగా ఇంటర్ సీట్లు పెంచి గిరిజన విద్యార్థులకు న్యాయం చేయాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్లా సురేష్, నాయకులు సీతారాం, చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం వీరు విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ కళాశాలలో ప్రస్తుతం ఉన్న సీట్లు నింపగా మిగిలిన విద్యార్థిని విద్యార్థులకు సీట్లు లేకపోవడంతో నిరాశ చెందుతున్నారని, ఈ మేరకు జిల్లాలోని కళాశాలలో ఇంటర్ సీట్లు పెంచి గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాలని పిఒను కోరారు.



శస్త్రచికిత్సకు రోగులను బస్సులో తరలిస్తున్న శంకర్ ఫౌండేషన్ సభ్యులు

అజ్జాడలో ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని అజ్జాడలో శనివారం సత్య సాయి భజన మండలి వారి ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 75 మంది కంటి రోగులకు పరీక్షలు చేయగా, 36 మందికి కంటి ఆపరేషన్ ఎంపిక చేసి, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఆపరేషన్ ఎంపికైన వారికి ఉచిత అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి భజన మండలి సభ్యులు, డాక్టర్ సురేష్, శంకర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



వరద నీరు రాకుండా గట్లు వేస్తున్న రైతులు

వరద ముంపునకు గురి కాకుండా అడ్డుకట్ట

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని గోపాలపురానికి చెందిన రైతుల భూములు గోముఖీ నది జంతిగెడ్డల వల్ల వచ్చే వరదలు సమయంలో భూములు ముంపునకు గురవుతున్నాయి. దీంతో స్థానిక రైతులు తమ కష్టాన్ని టిడిపి మాజీ మండల పార్టీ అధ్యక్షులు పెంట తిరుపతిరావు వద్ద వాపోయారు. దీంతో తిరుపతిరావు రూ.10వేలు ఆర్థిక సహాయంతో ముంపునకు గురికాకుండా భూములు చుట్టూ అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టారు. గోపాలపురం యూత్ లీడర్ కన్నంనాయుడు ఆధ్వర్యంలో జెసిబితో మట్టి కట్ట పనులు చేపట్టారు. తమ కష్టాన్ని చూసి ఆర్థిక సహాయం చేసిన తిరుపతిరావును రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

పెదబోగిలిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిలిలో పలు వీధుల్లో పారిశుధ్య పనులను చేపట్టినట్లు సర్పంచ్ జొన్నాడ తేరేజమ్మ, గరికయ్య తెలిపారు. శనివారం స్థానిక హడ్కో, న్యూ కాలనీల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పూడుకతీతలు, మురుగునీరు నిల్వ లేకుండా చేశారు. తాగునీటి కొళాయిల వద్ద శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇఒ జి.వెంకటరమణ, కార్యాలయ సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

దోమల నివారణతో మలేరియా దూరం

ప్రజాశక్తి - వీరఘట్టం

పరిసరాల శుభ్రతను పాటించి దోమలను నివారిస్తే మలేరియా నుంచి దూరం కావచ్చని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి అన్నారు. ఈ మేరకు శనివారం మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా వీరఘట్టంలో ర్యాలీ నిర్వహించారు. అపోహలు వీడి ప్రతి ఇంటిలో ఎసిఎం పిచికారీ చేయించుకోవాలని సూచించారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న బిజెపి

ప్రజాశక్తి - వీరఘట్టం

రాజ్యాంగం కల్పించిన హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తూ దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీని కొనసాగిస్తుందని ఎఐసిసిటియు నేషనల్ కౌన్సిల్ సభ్యులు బి.వాసుదేవరావు విమర్శించారు. ఈ మేరకు శనివారం మండలంలోని చలివేంద్రలో ఎఐసిసిటియు విస్తృత కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కనీసం ప్రాథమిక హక్కుల్ని కాపాడుకోవడానికి కార్మికులు, విద్యార్థి, యువకులు, మేధావులు, సమైక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. మెరుగైన వేతనం, రోజువారి పని, సామాజిక భద్రత, గౌరవప్రదమైన జీవనం, విద్య, వైద్యం గృహ వసతి కోసం భవన నిర్మాణ కార్మికులు పోరాడాలని ఆ దిశగా జులై 8, 9 తేదీల్లో కన్యాకుమారిలో జరుగు నాలుగువ జాతీయ మహసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా సిపిఐఎంఎల్ జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ మండలాల నుండి భవన నిర్మాణ కార్మికులు, ఆశ, ఆటో కార్మికులు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎఐసిసిటియు నాయకులు

బీమా.. పాడి రైతులకు ధీమా

ఇన్సూరెన్స్ చేయడానికి ఆసక్తి చూపుతున్న రైతులు

ప్రజాశక్తి - సీతంపేట

పశువుల బీమా పథకం ప్రభుత్వం మంజూరు చేయడంతో రైతులకు కొంత ప్రోత్సాహం కలిగింది. దీంతో పశువులు ఎటువంటి ప్రకృతి వైపరీత్యాలు, వివిధ కారణాలతో మృతి చెందితే ఆ రైతు నష్టపోకుండా ప్రభుత్వం పశు బీమా పథకం ఏర్పాటు చేసిన ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా ప్రీమియం లభిస్తుంది. ఈ బీమా తెల్లరేషన్ కార్డు ఉన్న పాడి రైతుకు మాత్రమే వర్తిస్తుంది. దీనిపై ఇప్పటికే పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, దోనుబాయి పశు వైద్యాధికారి వెటర్నరీ సిబ్బంది భాస్కరరావు గిరిజన గ్రామాల్లో పశు బీమా పథకంపై అవగాహన కల్పిస్తున్నారు. మండలంలో సుమారు 15 వేల ఆవులు, గేదెలు, 25వేల మేకలు, గొర్రెలు ఉన్నాయి. జెర్సీ ఆవులు ఐట్టి రూ.30వేలు విలువచేసే ఆవుకు రూ.1920 ఇన్సూరెన్స్ కు వీటిలో ప్రభుత్వం సబ్సిడీ రూ.1536, లబ్ధిదారుని వాటా 384 ఆదనంగా జీఎస్టీ ఛార్జీలు సుమారు రూ.15 వరకు పడతాయి. నాటు ఆవుకు రూ.15వేలు ప్రీమియం ఉండగా, బీమా రూ.960. దీనిలో ప్రభుత్వం సబ్సిడీ 768 రైతు వాటా 192 రూపాయలు జీఎస్టీ అదనంగా ఉంటుంది. పశు బీమా పథకం మూడేళ్ళ వరకు వర్తిస్తుంది. ఇప్పటికే గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ సిబ్బంది సచివాలయ వెటర్నరీ సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. రేషన్ కార్డు లేని పాడి రైతుకు రూ.30వేలు ప్రీమియం ఉంటే ఇన్సూరెన్స్ రూ.1920 ఉండగా, ప్రభుత్వం సబ్సిడీ రూ.960, లబ్ధిదారుని వాటా రూ. 960 ఉంటుంది. అలాగే తెల్లరేషన్‌కార్డు ఉన్న గొర్రెలు, మేకల పెంపకందారులు రూ.6వేలు ప్రీమియం ఉంటే రూ.180 ఇన్సూరెన్స్‌కు ప్రభుత్వం సబ్సిడీ రూ.104, పెంపకందారి వాటా రూ.36 బీమా చేయాల్సి ఉంది. కార్డుల లేనివారు రూ.6వేలు ప్రీమియంకు గానూ రూ.180 ఇన్సూరెన్స్, ప్రభుత్వం సబ్సిడీ 90, లబ్ధిదారుని వాటా 90 . రూపాయలు కట్టాల్సి ఉంది. పాలిసి జనరేట్ చేసి 15 రోజుల తర్వాత మృతి చెందిన ఆవుకు ఇది వర్తిస్తుంది. బీమా చేసిన ట్యాగ్ మిస్ అయితే సిబ్బంది వైద్యాధికారికి చెబితే రీ ట్యాగ్ వేస్తారు. పశువు మృతి చెందినప్పుడు చెవిలో ట్యాగ్ తప్పనిసరిగా ఉండాలి. కంపెనీ ప్రతినిధులు విచారణకు వచ్చేంత వరకు పశువు మృతదేహం తప్పనిసరిగా ఉండాలి. వైద్యాధికారి సర్టిఫై చేయాలి. ముందుగా రైతులు పశు వైద్యాధికారికి, సిబ్బందికి తెలియజేస్తే ఆవుకు కొలతలు వేసి రైతుతో సహా ఫోటోలు తీస్తారు. ఆవు జాతి, రంగు, రైతు ఆధార్, రేషన్‌కార్డు ప్రీమియంతో సహా పశువు బీమా పథకాం వెబ్సైటుకు నేరుగా వైద్య అధికారులు ఆన్లైన్లో అప్లోడ్ చేసి ఇన్సూరెన్స్ కట్టిస్తారు.



ఆవు చెవికి ట్యాగ్ వేయిస్తున్న రైతులు



శంకరరావు నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

శంకరరావు ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ కిల్లక శంకరరావు ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని వనకాబడిలో శంకరరావు రెండవ వర్ధంతి సభ శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ శంకర్రావు ఎర్ర జెండా నీడలో నిరంతరం పనిచేస్తూ గిరిజనులు ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకొని వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంలో కీలకపాత్ర పోషించారని కొనియాడారు. మరోవైపు సిపిఎం అభివృద్ధికి శక్తివంచన లేకుండా పని చేశారని అన్నారు. వనకాబడి సర్పంచిగా శంకరరావు మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం అన్నారు. గిరిజనులకు కొండపోడు పట్టాలు, గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని సిపిఎం ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు. ఆయన అకాల మరణం పార్టీకి తీరనిలోటని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేకత విధానాలపైనా, గిరిజనులు ఎదుర్కొంటున్నట్టు వంటి మౌలిక సమస్యలపై పరిష్కారం కోసం సిపిఎం పిలుపులో అందరూ భాగస్వామ్యం కావడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పువ్వల తిరుపతిరావు, మండంగి వెంకట్రావు, గ్రామ పెద్దలు పువ్వల గోవిందరావు, సత్యనారాయణ, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మా తోటలో మట్టి నమూనాలు సేకరణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని రాయగడ జమ్మూ పంచాయతీ వల్లాడలో 14మంది మా తోట రైతులకు భూసార పరీక్షలు నిమిత్తం మట్టి నమూనాలను సేకరించినట్లు జట్టు జీవ కోఆర్డినేటర్ జి.ప్రభోద్ తెలిపారు. గతంలో నాబార్డ్ సహకారంతో జట్టు పర్యవేక్షణలో 500 మంది రైతులకు 500 ఎకరాల్లో మా తోట కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. అభివృద్ధి చెందిన ఫల సాయం రైతులకు తోట్పాడు అందిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం కలిగిందన్నారు. అయితే మాతోట పరిధిలో అంతర్ పంటలు, దేశీ వరి, చిరుధాన్యాలు, ఆకు, కాయగూరలు, తీగ జాతులు పెంపొదించే కార్యక్రమంలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద నాబార్డు సహకారంతో జీవ ప్రాజెక్ట్ పరిధిలో జట్టు సంస్థ పర్యవేక్షణలో అర్.జమ్మూలో 9మంది, పెంగవలోని 9 మంది, గౌరడలో 8మంది, వల్లాడలో 14 మంది రైతులకు పైలెట్ ప్రాజెక్టు కింద కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్టు తెలిపారు. ఈ పైలెట్ ప్రాజెక్టు కింద విజయవంతంగా చేపట్టిన కార్యక్రమాలు ఫలప్రదమైనట్లయితే మిగతా 460 మంది రైతులకు వచ్చే ఏడాది ఈ కార్యక్రమాలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ మట్టి నమూనా సేకరణలో భూమిలోని లాభ భూష్టమైన సూక్ష్మ స్థూలపాల కాలనీ కనిపెట్టి సంబంధిత సేంద్రియ ఎరువులను రైతులకు జట్టు సంస్థ ప్రతిపాదిస్తుందని తెలిపారు. తద్వారా రైతులు పండ్ల తోటలతో పాటు అంతర పంటలతో ఆర్థిక అభివృద్ధి చెంది వారి జీవనోపాధులు మెరుగుపర్చు కోవడా నికి ఇది ఒక బృహత్తర కార్యక్రమం రైతులం తా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జట్టు కోఆర్డినేటర్ జి.మురళీ మోహన్, గౌరు నాయుడు, రైతులు లక్ష్మణరావు, పారయ్య పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలివ్వాలని గిరిజనుల నిరసన

గుమ్మలక్ష్మీపురం : గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, నాయకులు పువ్వల ప్రసాద్, ,పత్తిక మోహన్ రావు, గిరిజనులు ఉన్నారు.



రైతులకు నవధాన్యాలను అందజేస్తున్న రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ ప్రకాష్

సిసి రోడ్లు, కాలువలు నిర్మించాలి

ఎమ్మెల్యేకు మద్దాలవారివీధి వాసుల వినతి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని 25వ వార్డు మద్దాలవారివీధి (బొగ్గులవీధి)లో రోడ్డుకు ఇరువైపులా సిసి రోడ్లు, కాలువలు వేయాలని ఆ వీధి వాసులు ఎమ్మెల్యే అలజంగి జోగారావును కోరారు. శుక్రవారం రాత్రి ఈ వీధిలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమం లో భాగంగా సిఐటియు జిల్లా నాయకులు గొర్లి వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకలసన్యాసిరావు, వీధి ప్రజలంతా కలిసి మద్దాలవారివీధికి ఇరువైపులా మురుగు కాలువలు, సిసి రోడ్డు, పైపులైను కొత్తగా నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే శ్మశాన వాటికలో ఉన్న తుప్పలు, డొంకలు, వ్యర్థాలు తొలగించి మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ రోడ్లు, కాలువలు మంజూరయ్యాయని, టెండర్లు కూడా పూర్తి చేశారని, పైపులైను కూడా వేస్తారని తెలిపారు. అలాగే సిరిశిన చెట్టు దగ్గర ఉన్న శ్మశాన వాటిక బాగుకు నిధులు మంజూరు చేసి మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్ కొండపల్లి రుక్మిణి, వార్డు కౌన్సిలర్ నిమ్మకాయల సుధీర్ కుమార్ ,వైసిపి పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వైసిపి కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఎం.రవికుమార్, కౌన్సిలర్లు, కమిషనర్ సిహెచ్ అప్పలనాయుడు, శానిటరీ ఇన్స్పెక్టర్ మురళి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నారాయణరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిని అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు, మద్దాలవీధి వాసులు

చిన్నారులకు మట్టిబొమ్మల తయారీ పోటీ

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పిల్లలు మట్టి బొమ్మల తయారీ పోటీలో పాల్గొన్నారు. డ్రాయింగ్ మాష్టర్ జి. మురళీకృష్ణ పర్యవేక్షణలో మట్టితో బొమ్మలను పిల్లలు తయారు చేశారు. సమ్మర్ క్యాంప్ ముగింపు రోజు పిల్లలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి గణేష్‌బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

సీతానగరం : స్థానిక గ్రంథాలయంలో చిన్నారులకు వేసవి శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. సుమారు 15 రోజుల పాటు జరిగిన శిక్షణ తరగతుల్లో విద్యార్థులు అంశాలపైన శిక్షణ పొంది అలాగే వివిధ ఆటలు పోటీలో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శాఖా గ్రంథాలయాధికారి బి.వెంకటరావు పాల్గొన్నారు.



సీతానగరం : పుస్తకపఠనం చేస్తున్న విద్యార్థిని

ఇంటర్నెట్ సేవలు అందించాలి

ప్రజాశక్తి - కొమరాడ

కేరళ మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇంటర్నెట్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇంటర్నెట్‌ను ప్రాథమిక హక్కుగా ప్రకటించిన ఏకైక రాష్ట్రం కేరళ అని ఇలాంటి సందర్భంలో పేదరికం, గిరిజన ప్రాంతం ఎక్కువ ఉన్న మన రాష్ట్రంలోనూ ఉచిత ఇంటర్నెట్ విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక లోకబందు రెసిడెన్సీలో ఆదివారం ఉదయం 10గంటలకు అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి తెలిపారు. జనసేన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించి కార్యక్రమాన్ని రూపొందింస్తామన్నారు.

13న బిటి రోడ్డు ప్రారంభోత్సవం

రామభద్రపురం : రామభద్రపురం, సాలూరు హైవే రోడ్డు నుంచి మండలంలోని జన్నివలసకు కొత్తగా నిర్మించిన బిటి రోడ్డు ప్రారంభోత్సవానికి ఈ నెల 13న టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులు వస్తారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్తానిక ఎమ్మెల్యే శంబంగి చినప్పలనాయుడు కోరారు

జగన్నాథుని రథం కోసం దీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జగన్నాథుని రథం ఏర్పాటు చేయాలని పట్టణంలోని జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం నిరసన దీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గొర్లి చంటి, అల్లూరి ఆనంద్, తాళ్లపూడి సంతోష్, గొర్లి అంజి, కోరాడ హేమంత్, మండల మోహన్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా రథం లేకుండా రథాయాత్ర నిర్వహిస్తూ ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా దేవాదాయ శాఖ అధికారులు ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒడిశా తర్వాత ఘనంగా నిర్వహించే పార్వతీపురం జగన్నాథుని రథయాత్రకు రథం లేకపోవడం దారుణమన్నారు. గత ఏడాది రథం కోసం నిరసన చేపడితే వచ్చే ఏడాదికి సిద్ధం చేస్తామని అప్పట్లో అధికారులు హామీ ఇచ్చి తప్పించుకున్నారన్నారు. ఏడాది గడిచినా ఇప్పుడు మళ్లీ సమయం చాలదంటూ చెప్పడం బాధాకరమన్నారు. ఆలయానికి ఆస్తులు ఉన్నప్పటికీ ఆదరణ లేదన్నారు. ఆలయానికి ఉన్న దుకాణాలకు బహిరంగ వేలం పాటను పెట్టాలని, ఆలయానికి కరెంటు లేకపోవడంతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయని అన్నారు. కనీస ఆదరణ లేక జగన్నాథ స్వామి దేవాలయం కూనరిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని అన్ని దేవాలయాలకు కమిటీలు వేయాలని డిమాండ్ చేశారు. ఆలయాలకు ఉన్న ఆస్తులు బహిర్గతం చేయాలన్నారు. బహిరంగ వేలం పాటలో వచ్చే ఆదాయం, ఆస్తుల వివరాలు ఏటా ప్రజలకు చెప్పాలన్నారు. జగన్నాథస్వామి రథం తయారీకి రాతపూర్వక హామీ అధికారులు ఇచ్చేంత వరకూ నిరసన దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమం లో దేవాలయాల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు తాళాబత్తుల శ్రీనివాసరావు, జనసేన నాయకులు అనిల్ కుమార్, దాలినాయుడు తదితరులు సంఘీభావం తెలిపారు.

నవధాన్యాల సాగు నేలతల్లి బాగు

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రధాన పంటకు ముందుగా భూమిని ఖాళీగా ఉంచకుండా నవధాన్యాలు సాగు చేసి కలియ దున్నినట్లయితే ప్రధాన పంటకు కావాల్సిన పోషకాలు అన్ని భూముల్లో లాభం వల్ల ఆరోగ్యవంతమైన పంట పండుతుందని ఎపిసిఎన్ఎఫ్ రీజనల్ టెక్నికల్ ఆఫీసర్ కె.ప్రకాష్ అన్నారు. మండలంలోని అమ్మవలస, పి.కోనవలస, కొటికపెంట రైతు భరోసా కేంద్రాల పరిధిలో ప్రకృతి సేద్య కార్యక్రమాలను పరీక్షించిన అనంతరం రైతులకు నవధాన్యాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆ రైతులతో మాట్లాడుతూ నవధాన్యాలు కలియదున్నడం వల్ల భూమిలో జీవ వైవిధ్యం పెరుగుతుందని, తద్వారా పంటకు అందుబాటులో లేని అనేక రకాల మూలకాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రైతుకు మిత్రుడుగా పిలవబడే వానపాముల వృద్ధి జరుగుతుందని నేలలో మట్టి కణాలు అభివృద్ధి చెంది భూ భౌతిక స్థితి మెరుగుపడడం వల్ల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. భూమి వేసవిలో కూడా కప్పి ఉంచడం వల్ల చల్లగా ఉండి పోషకాలు నష్టపర్చకుండా ఉంటుందని, తద్వారా భూసారం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అంతేకాకుండా నవధాన్యాల్లో 20 నుంచి 30 రకాల విత్తనాలు కలిగి ఉండడం వల్ల వేరు వ్యవస్థ చుట్టూ వివిధ రకాల జీవ ద్రవ్యం ఉత్పత్తిని చెందడంతో భూసారం పెరిగి రసాయన ఎరువులపై ఖర్చు గణనీయంగా తగ్గడమే కాకుండా పంట ఆరోగ్యంగా పెరగడం, చీడపీడల ఉధృతి తక్కువగా ఉంటుందని అన్నారు. అనంతరం అమ్మవలసలో ఘన జీవామృతం తయారీని పరిశీలించి ఎకరాకు దుక్కిలో 200 కిలోల ఘనజీవామృతం వేయడం వల్ల అనంతరం 15 రోజుల వ్యవధిలో మూడు నుండి నాలుగు సార్లు ద్రవ జీవామృతం వేయడం ద్వారా రసాయన ఎరువులపై ఖర్చు పూర్తి స్థాయిలో తగ్గిపోతుందని తెలిపారు. కావున రైతులు ఆరోగ్యవంతమైన పంటను అతి తక్కువ ఖర్చుతో పండించాలంటే ప్రకతి సేద్యం వైపు మళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్య ప్రతినిధులు యశోదమ్మ, రమణమ్మ, బాలకృష్ణ, తిరుపతి నాయుడు, ఐసిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.

గడగమ్మలో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని గడగమ్మలో శనివారం స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు జంపు కన్నతల్లి- ఉమామహేశ్వరరావు, మాజీ సర్పంచి రఘుమండల వెంకటరమణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజేశ్వరి, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు , కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకాదేవి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక షిర్డీ సాయి ద్వారకామాయి ఆలయంలో గతమూడు రోజులుగా నిర్వహిస్తున్న రేణుకాదేవి విగ్రహ ప్రతిష్టామహోత్సవం శనివారంతో ఘనంగా ముగిశాయి. గర్భాం వేదపండితులు విశ్వనాథ్ శర్మ ఆధ్వర్యంలో రుత్వికులు ప్రతిష్టా పూజలు, హోమాలు, సూర్య నమస్కారాలు, పూర్ణహుతీ చేపట్టారు. శనివారం ఉదయం 7.35 గంటలకు రేణుకాదేవి యంత్ర విగ్రహా ప్రతిష్టను వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. అనంతరం వందలాది మంది భక్తులు రేణుకాదేవిని దర్శించకున్నారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో వైసిపి మన్యం జిల్లా అద్యక్షుడు పరీక్షిత్ రాజు, ఎంపిపి శెట్టి. పద్మావతి, నాయకులు అంధవరపు కోటేశ్వరరావు,శెట్టి నాగేశ్వరరావు, నిర్వహకులు నెల్లి శ్రీనివాస్, కొత్తకోట రమేష్, రవీంద్ర కుమార్, ప్రహ్లాదరెడ్డి, బరాటం గుంపసోమేశ్వరరావు ,భక్తులు భారీగా పాల్గొన్నారు.

ఉపాధి హామీ వేతనదారులకు టిడిపి భరోసా

ప్రజాశక్తి -సీతానగరం

ఉపాధి హామీ వేతనదారులకు తెలుగుదేశం పార్టీ భరోసాగా ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు గర్బాపు ఉదయభాను అన్నారు. మండలంలోని అప్పయ్యపేట, బల్లకృష్ణాపురంలో ఉపాధి హామీ వేతనదారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులకు మంచి పరిపాలన అందించాలంటే తెలుగుదేశం పార్టీకి అండగా ఉండాలన్నారు. రోజురోజుకు ధరలు పెరుగుతున్నాయని, కూలీలు బతకలేని పరిస్థితి వచ్చిందని, వైసిపిని గద్దించి టిడిపి అధికారంలో తెచ్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వేతనదారులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బంగారం చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని మెంటాడ వీధికి చెందిన ఎన్.యోగితాలక్ష్మీ ఇంట్లో 300గ్రాముల బంగారం చోరీ జరిగిందని ఫిర్యాదు అందినట్లు టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. ఏడాది క్రితం పరిచయమైన దుర్గాప్రసాద్ అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు సిఐ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

400లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని వేర్వేరు చోట్ల నిర్వహించిన సోదాల్లో పోలీసులు 400 లీటర్ల నాటుసారాను శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఉదయం ఆరు గంటల సమయంలో ముందస్తు అందిన సమాచారం మేరకు రెల్లివీధి వెనుక తుప్పల్లో 20 క్యాన్లలో 400లీటర్ల నాటు సారాను గుర్తించినట్లు టౌన్ ఎస్ఐ పాపారావు చెప్పారు. ఈ నాటుసారా ఎవరిదని ఆరా తీయగా తుపాకుల సుమన్ దని తెలియడంతో ఆయన్ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. అలాగే ఒడిశా నుంచి వచ్చిన ఇద్దరు మహిళల వద్ద కూడా 250 సారా పాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.